
సాక్షి
మెదక్
శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023

ఆడిటర్‌పై విచారణ..



కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సంబంధించిన ఆడిటర్‌పై గతంలో ఆలయ ఈవో బాలాజీ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు నాలుగు రోజులుగా విచారణ జరుపుతున్నారు.

వివరాలు 8లో ▸



క్రీడలతో మానసిక..

క్రీడల ద్వారా మానసిక, శారీరక దృఢత్వం పొందవచ్చని అంతర్జాతీయ సైనిక బాక్సింగ్ ఛాంపియన్ జె.రామయ్య అన్నారు.

వివరాలు 8లో ▸



వరికొయ్యలు కాల్చొద్దు

వరిపంట కోసిన తర్వాత కొయ్యలను కాల్చొద్దని కేవీకే శిక్షణ విద్యార్థులు రైతులకు సూచించారు. రైతులకు యాసంగి పంటల సాగుపై అవగాహన కల్పించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

జిల్లా విద్యాధికారి రాధాకిషన్



డీఈఓను సన్మానిస్తున్న టీచర్లు

పాపన్నపేట(మెదక్): ఉన్నతి కార్యక్రమంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. గురువారం కొత్తపల్లిలో జరిగిన కాంప్లెక్స్ సమావేశాలకు హాజరై మాట్లాడారు. ఉన్నతితో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంపొందించి, చదవడం, రాయడం నేర్చుకునేలా చేయాలన్నారు. ప్రతీ ఒక్కరూ అలైన్‌మెంట్ రిజిష్టర్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరు వందశాతం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇన్నోవేషన్ అవార్డులు అందుకున్న టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సురేందర్‌గౌడ్, మహేశ్వర్, శ్రీనివాస రావు, నోడల్ అధికారి ప్రతాప్‌రెడ్డి, మాధవరెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ



రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన అబ్దుల్లా

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో మెదక్ పట్టణానికి చెందిన అబ్దుల్లా రజిత పతకం సాధించినట్లు రెంజుకి షాటోకాన్ వ్యవస్థాపకుడు, కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6, 7 తేదీల్లో నల్గొండలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 67వ రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, నల్లగొండ, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. అబ్దుల్లా అండర్ 17 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడన్నారు. సమావేశంలో కరాటే కోచ్ దినాకర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

10న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

మెదక్ కలెక్టరేట్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ డిసెంబర్– 2023 పరీక్షకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ గురువారం తెలిపారు. ఇందు కోసం జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు సెంటర్లు, అలాగే జెడ్పీహెచ్ బాయ్స్, నర్సాపూర్, జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్, తూప్రాన్‌లో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు వారి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

లే అవుట్ అనుమతుల్లో జాగ్రత్తగా ఉండాలి

డీటీసీపీఓ కరణ్



మాట్లాడుతున్న డీటీసీపీఓ కరణ్

కౌడిపల్లి(నర్సాపూర్): బిల్డింగ్, లేఔట్ అనుమతులు ఇచ్చే విషయంలో జాగ్రత్తగా ఉండాలని జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్ (డీటీసీపీఓ) కరణ్ అన్నారు. గురువారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ క్యాదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు గ్రామాల్లో బిల్డింగ్, లేఔట్ అనుమతులు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత జీఓ నంబర్ 67, జీఓ నంబర్ 168 ప్రకారం అనుమతులు ఇవ్వాలన్నారు. దరఖాస్తులను నిశితంగా పరిశీలించి అన్ని వసతులు ఉంటేనే అనుమతులు ఇవ్వాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీఓ కలీముల్లా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దామోదర.. దరహాసం

మరోసారి వరించిన అమాత్య పదవి



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఆందోల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీలారపు దామోదర రాజనర్సింహ ముచ్చటగా మూడోసారి అమాత్య పదవి దక్కించుకున్నారు. రాష్ట్రంలో గురువారం కొలువు దీరిన కొత్త ప్రభుత్వంలో మంత్రి పదవి పొందారు. మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయన ఇప్పటికే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఎమ్మెల్యే నుంచి డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగి రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. దామోదర రాజనర్సింహది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబమే. ఆయన తండ్రి దివంగత రాజనర్సింహ మంత్రిగా పనిచేశారు. తల్లి జానాబాయి. ఈ దంపతులకు దామోదర్ రెండో కుమారుడు. 1958 డిసెంబరు 5న జన్మించాడు. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. దామోదర రాజనర్సింహ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించారు.

నాలుగోసారి ఎమ్మెల్యేగా...

దామోదర తండ్రి మాజీ మంత్రి రాజనర్సింహ అకాల మరణంతో ఆయన రాజకీయాల్లోకి రావాల్సి వచ్చింది. 1989లో ఆందోల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తొలి విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో రెండుసార్లు ఓటమి పాలైనప్పటికీ నియోజకవర్గ ప్రజల సేవలోనే ఉన్నారు. తర్వాత 2004 ఎన్నికల్లో అప్పట్లో మంత్రిగా పనిచేసిన పి.బాబూమోహన్‌పై విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఆయనకు భారీ మెజారిటీ వచ్చింది. 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో దామోదరకు స్థానం దక్కింది. ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2009లో జరిగిన ఎన్నికల్లో కూడా విజయం సాధించారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో (వైఎస్‌ఆర్, రోశయ్య హయాంలో) మంత్రి పదవి చేపట్టారు. తర్వాత సీఎంగా పనిచేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా దామోదరకు మంత్రి పదవి ఇచ్చారు. దామోదర రాజనర్సింహ మూడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉన్నారు.

పొన్నంకు అమాత్య యోగం

విద్యార్థి నేత నుంచి మంత్రి వరకు



సాక్షి, సిద్దిపేట: పొన్నం ప్రభాకర్ అనే నేను అంటూ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో పొన్నంకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అవకాశం కల్పించింది. హుస్నాబాద్‌లో పార్టీ నుంచి ఎమ్మెల్యేగా తొలిసారి పొన్నం గెలుపొందారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో గురువారం పొన్నం మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. విద్యార్థి సంఘం నాయకుడి నుంచి రాష్ట్ర మంత్రిగా అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తున్నారు.

అంచెలంచెలుగా..

1987–1988లో ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, 1992– 1998 వరకు రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా, 1999–2002 వరకు రాష్ట్ర అధ్యక్షునిగా పని చేశారు. 2002–2004 వరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగారు. 2005–2009 వరకు ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, 2009 –2014 వరకు కరీంనగర్ ఎంపీగా పని చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు కోసం పోరాటం చేస్తుండగా పెప్పర్ స్ప్రేను ఎదుర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమ నాయకుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగిస్తూ విమర్శలు ఎక్కుపెట్టిన నాయకుడిగా ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు. తాజాగా హుస్నాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

జిల్లాలో పట్టు పెంచుకునేందుకే..

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పట్టును పెంచుకునేందుకే పొన్నంకు మంత్రి పదవిని కేటాయించారు. సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు, గజ్వేల్‌లో మాజీ సీఎం కేసీఆర్, దుబ్బాకలో కొత్త ప్రభాకర్ రెడ్డి, జనగామలో పల్లా రాజేశ్వర్ రెడ్డిలు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే గెలుపొందారు. దీంతో జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించేందుకు మంత్రి వర్గంలో చోటు కల్పించినట్లు పార్టీ వర్గాల సమాచారం. పార్టీ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయనున్నారు.

పంటలపై తుపాన్ పడగ

- చేతికందే సమయంలో విరుచుకుపడిన మిచాంగ్
- నాలుగు రోజులుగా చిరుజల్లుతో కూడిన వర్షం
- పత్తి, మిర్చి, మామిడి, కూరగాయలకు తీవ్రనష్టం
- ఆందోళన చెందుతున్న రైతులు



రేగోడులో సాగవుతున్న పత్తి పంట

మెదక్: ఆరుగాలం చెమటోడ్చి పంటలను సాగుచేస్తే పంట ఉత్పత్తులు చేతికందే సమయంలో మిచాంగ్ తుపాన్ ప్రభావంతో పంటలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మిర్చి, మామిడి తోటలతోపాటు కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. నాలుగు రోజులుగా జిల్లాలో చల్లటి వాతావరణంతో పాటు అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో చేతికందిన పత్తి సేకరించలేని పరిస్థితి నెలకొంది. ఒకవేళ పికింగ్ చేపట్టినా అదినల్లబారి మార్కెట్లో ఎవరూ కొనుగోలు చేయరని పత్తి రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో పెద్దశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్ తదితర మండలాల్లో ఈసారి వర్షాధారంగా 38,750 ఎకరాలలో పత్తిపంటను సాగుచేశారు. ఈ పంట చేతికందే సమయం వచ్చింది. చేను నుంచి 2–3 విడతలుగా పత్తి సేకరణ చేపడతారు. మొదటి విడతలో పత్తి సేకరించారు. రెండో విడతలో మిచాంగ్ తుఫాన్ పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు చెబుతున్నారు. తేమ వాతావరణంలో పత్తి నల్లగామారుతుందని, దీంతో కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రారంటున్నారు. అంతేకాకుండా వర్షపునీరు పత్తికాయలోకి చేరితే గింజలు సైతం మొలకెత్తవని ఆందోళన చెందుతున్నారు. అదే జరిగితే పత్తి రైతులకు కనీస పెట్టిన పెట్టుబడి కూడా రాదని వాపోతున్నారు. తుపాన్ నాలుగు రోజులుగా పత్తి రైతులను కునుకు తీయకుండా చేస్తోంది. ఇప్పటికే ఒక దశ పత్తి పికింగ్ చేపట్టిన రైతులు వాటికి సరైన ధరలేదని దిగాలు చెందుతుంటే, మరోమారు పికింగ్‌కు సిద్ధమైన పత్తి రైతులను తుపాన్ వారిని ఆగం చేస్తోంది.

ఇతర పంటలపైనా...

తుపాన్ ప్రభావంతో పత్తి, మిర్చి, మామిడి, ఇతర కూరగాయల పంటలు సైతం దెబ్బతినే ప్రమాదం ఉంది. జిల్లా వ్యాప్తంగా 3 వేల ఎకరాలకుపైగా మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. అలాగే మిర్చి, కూరగాయల పంటలు 300 ఎకరాలలో సాగు చేస్తారు. ప్రస్తుతం మిర్చి పంటసైతం చేతికందే దశకావటంతో అకాల వర్షాలతో మిర్చి నల్లబారుతోంది. మామిడి తోటలకు బూడిద తెగులు సోకే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఈ తెగులు ఆశిస్తే పూత రాలిపోతుందని పేర్కొన్నారు. మామిడి తోటలకు బూడిద తెగుళ్ల సోకితే వెంటనే సంబంధిత ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని ఆశాఖ అధికారులు చెబుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: త్వరలో స్థానిక సంస్థలకు జరగబోయే ఎన్నికల దృష్ట్యా నూతనంగా ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. గురువారం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) రాష్ట వ్యాప్తంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల సరళిని కలెక్టర్ ఈసీఐకి వివరించారు. అనంతరం మెదక్, నర్సాపూర్ ఆర్డీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం–6 ద్వారా నమోదు చేసుకున్న వారి ఓటును బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్ల ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు 2024, జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు నూతన ఓటరుగా ఫారం 6 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. 2024, జనవరి 6వ తేదీన ముసాయిదా జాబితా ప్రకటన, 2024 ఫిబ్రవరి 8 తుది ఓటరు జాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. గుర్తింపు కార్డులను సరైన నమూనాలో తయారు చేయాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఆన్‌లైన్ ద్వారా కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం బూత్ లెవల్ అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గ్రామాలవారీగా ఫాం 6ను త్వరితగతిన ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయాలని బీఎల్‌ఓ, బీఎల్‌ఓ సూపర్‌వైజర్‌లను ఆదేశించాలన్నారు. సమావేశంలో మెదక్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే నా ధ్యాస

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



దుర్గమ్మసన్నిధిలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, హన్మంత్‌రావు కుటుంబ సభ్యులు

పాపన్నపేట(మెదక్): మెతుకు సీమ అభివృద్ధే నా ధ్యాసగా.. ప్రతి పల్లె ప్రగతే నా శ్వాసగా పనిచేస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటిసారి తన తండ్రి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, తల్లి వాణి, భార్య శివానితో కలసి గురువారం నియోజకవర్గానికి వచ్చారు. ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ మోహన్ రెడ్డి, ఆలయ సిబ్బంది, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం విలేకరులతో మాట్లాడారు. మెదక్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఏడుపాయలపై సమీక్ష నిర్వహించి, లోటు పాట్లను గుర్తించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇటీవల మంజూరు చేసినట్లు చెపుతున్న రూ.100 కోట్ల విషయం ఎంత వరకు వచ్చిందో తెలుసుకొని, ముందుకు సాగుతానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ నాయక్, అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, పార్శి నర్సింలు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

మెదక్ కలెక్టరేట్: ఎమ్మెల్యేగా గెలుపొందిన మైనంపల్లి రోహిత్‌రావు శుక్రవారం మెదక్ రానున్నట్లు డీపీఆర్‌ఓ గురువారం తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో ఉదయం పూజా కార్యక్రమాలు ఉంటాయని, 11 గంటలకు సర్వమత ప్రార్థనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంట వరకు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం జరుగుతుందున్నారు.

రగ్బీ పోటీలకు 24 మంది ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 14 టచ్ రగ్బీ పోటీల్లో 24 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు రమేష్, రామేశ్వర్ రెడ్డి, అమూల్యమ్మ, కోచ్ కరణం గణేష్ రవి కుమార్ గురువారం తెలిపారు. జిల్లా నుంచి 150 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొనగా 12 మంది బాలికలు, 12 మంది బాలురను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. వీరు ఈనెల 10, 11, 12 తేదీల్లో మేడ్చల్ జిల్లాలోని కండ్లకోయలోగల సన్‌ఫ్లవర్ వేదిక్ స్కూల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శారద, వెంకటేష్, పీఈటీలు బాలరాజ్, ఆశీర్వాదం, చంటి, ప్రీతి, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ రిఫరీ శ్రీనాథ్ పాల్గొన్నారు.

పౌల్ట్రీ రంగం కుదేలు

అమాంతం తగ్గిన కోడి ధరలు

- మూడు నెలల క్రితం లైవ్ బర్డ్ ధర కిలో రూ.105పైనే..
- నేడు రూ.50కు పడిపోయిన ధైన్యం
- కార్పొరేట్‌ల మాయాజాలమే కారణమా?
- తీవ్ర నష్టాలతో రైతుల్లో కలవరం
- కోళ్ల ఉత్పత్తుల్లో సింహభాగం ఇక్కడే



గజ్వేల్‌లో నిర్వహిస్తున్న పౌల్ట్రీ ఫారం

పౌల్ట్రీ రంగం కుదేలవుతోంది. మూడు నెలల క్రితం కోడి(లైవ్ బర్డ్) ధర రూ.105 పలకగా, నేడు రూ.50కి పడిపోయింది. తీవ్ర నష్టాలతో రైతులు కలవరానికి గురవుతున్నారు. సొంతంగా పరిశ్రమను నడుపుకుంటున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఉత్పత్తులు భారీగా పెరడగం.. కార్పొరేట్‌ల మాయాజాలం ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. కోళ్ల ఉత్పత్తుల్లో తెలంగాణ, ఏపీల్లోనే అగ్రగామిగా వర్ధిల్లుతున్న ఉమ్మడి మెదక్ జిల్లాలో పరిస్థితి ఇది.

గజ్వేల్: ఉమ్మడి మెదక్ జిల్లా (సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్)లో వ్యవసాయ రంగం తర్వాత రెండో అతి పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ వెలుగొందుతోంది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోనే అత్యధికంగా ఉత్పత్తులను అందిస్తున్న జిల్లాగా ఈ ప్రాంతం ఖ్యాతి గడించింది. ప్రతి నెలా ఇక్కడ వెయ్యి కోట్ల మేర లావాదేవీలు సాగుతుంటాయని అంచనా. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ పరిశ్రమ నేడు కుదేలవుతోంది. వేలాది మంది రైతులు సుగుణ, వెంకటేశ్వర, డైమండ్, జాహ్నవి, జానకీ, ఎస్‌ఆర్, స్నేహ తదితర ఇంటిగ్రేటెడ్ సంస్థల భాగస్వామ్యంతో పౌల్ట్రీ పరిశ్రమ నడుపుతున్నారు. ఈ సంస్థలతో పరిశ్రమను నడుపుకోవాలనుకుంటే రైతులు షెడ్, లేబర్, కరెంట్, నీరు వంటి మౌలిక వసతులను కల్పించాల్సి ఉంటుంది. ఆ సంస్థల నుంచి చిక్స్ అందించి వాటికి 45రోజుల వ్యవధికోసం మందులు, దాణా అందుతుంది. ఒక్కో బర్డ్ సగటున రెండు కిలోలకు పైగా తూకం వస్తుంది. ఈ స్థాయికి వచ్చే వరకు సంస్థలు రెండు కిలోల కోడిపై రూ. 180కిపైగా ఉత్పత్తి వ్యయం కింద ఖర్చుచేస్తున్నాయి. ఇందులో భాగంగానే చిక్స్(కోడిపిల్ల) రూ.40, దాణాకు (కోడి పెరిగేంతవరకు) కిలోకు రూ.31 చొప్పున రూ.140, ఇతర ఖర్చులు మరో రూ.4రూపాయలకు పైగా మొత్తంగా రూ.180 ఒక్కో కోడి పిల్లపై ఖర్చు చేస్తున్నారు. మార్కెట్‌లో చికెన్ ధరతో సంబంధం లేకుండా రైతులకు ఒక్కో కోడిపై కిలోకు రూ. 5–6 చెల్లిస్తాయి. నిర్వహణ బాగుంటే మరో 50పైసలు అదనంగా చెల్లిస్తారు. ఇదిలాఉంటే ఇంటిగ్రేటెడ్ సంస్థల ఒప్పందం ప్రకారం ఉత్పాదక వ్యయం భారీగా పెరిగితే మాత్రం రైతులు నష్టాలు భరించాల్సి ఉంటుంది. 5శాతం కోళ్లకంటే ఎక్కువగా మృత్యువాతపడితే నష్టాలను రైతులే భరించాలి. విద్యుత్ ఛార్జీల రూపేణా 5వేల కోడిపిల్లల సామర్థ్యం కలిగిన షెడ్‌కు 45రోజులకు రూ.5వేలపైనే బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. వీటన్నింటినీ మినహాయిస్తే ఈ సంస్థల భాగస్వామ్యంతో కోళ్లను పెంచుతున్న రైతులకూ మిగులుతున్నది అంతంతమాత్రమే.

చిక్స్ ధర రూ.40 అయితే..

సొంత పరిశ్రమలో ఒక్కోకోడి ఉత్పత్తి చేయడానికి అన్నీ కలుపుకొని రూ.180కిపైగా వరకు ఖర్చవుతున్నది. సుమారు రెండు కిలోలపైగా బరువుండే లైవ్ బర్డ్స్ చికెన్ ధర రూ. 210కి పైగా పలికితే నష్టాలు ఉండవు. కానీ ధరలో నిలకడగా ఉండటంలేదు. నెలరోజులుగా లైవ్ బర్డ్ ధర కిలోకు కేవలం రూ.50 మాత్రమే పలుకుతున్నది. ప్రస్తుతం చిక్ (కోడిపిల్ల) ధర రూ.40కు పెరగగా, నలభై అయిదు రోజులు పెంచిన లైవ్ బర్డ్ ధర కిలోకు కేవలం రూ.50మాత్రమే పలకడం రైతులను కుంగదీస్తున్నది. ఇంటిగ్రేటేషన్ కింద ఉన్న రైతులకు సైతం ధరలు గణనీయంగా పడిపోయిన ప్రస్తుత తరుణంలో ఫారాల్లో ఎక్కువ రోజుల పాటు లిఫ్ట్ చేయకుండా కోళ్లు ఉండటం వల్ల నిర్వహణ ఖర్చులు పెరిగి పెద్దగా కలిసి రావడం లేదనే చెప్పాలి. మరోవైపు దాణా ధరలు ఏటా పెరుగుతుండటం కూడా రైతులను కుంగదీస్తున్నది. దాణాలో సోయా, మొక్కజొన్న, ఇతర పోషకాల మిశ్రమంగా ఉంటుంది. గతేడాది కిలోకు రూ.37 పలికిన దాణా ధర ప్రస్తుతానికి రూ. 45కు పెరగటం వల్ల రైతులకు భారంగా మారుతోంది.

క్లుప్తంగా

కేతకిలో కర్ణాటక హైకోర్టు జడ్జి పూజలు



జడ్జి దంపతులను సన్మానించిన అర్చకులు

ఝరాసంగం(జహీరాబాద్‌): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకి సంగమేశ్వర ఆలయంలో కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి ఎస్‌కే పాటిల్‌ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి, పూలమాల, శాలువాతో సన్మానించారు.

కేదార్‌నాథ్‌ పూజారికి సన్మానం

నారాయణఖేడ్‌: దేశంలోని ప్రధాన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కేదార్‌నాథ్‌ ఆలయ ప్రధాన పూజారి శివలింగస్వామి మూడు రోజుల కిందట తన స్వగ్రామమైన ఖేడ్‌ మండలం చాప్టా(కె)కు వచ్చారు. గురువారం డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆయనను దర్శించుకుని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన ఆశీస్సులు పొందారు. పలువురు కాంగ్రెస్‌, యువజన కాంగ్రెస్‌ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

పోక్సో కేసులో మూడేళ్ల జైలు

సిద్దిపేటఅర్బన్‌: బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి అడిషనల్‌ డిస్ట్రిక్ట్‌ అండ్‌ సెషన్స్‌ కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు, రూ.1500 జరిమానా విధించినట్లు సిద్దిపేట త్రీటౌన్‌ సీఐ భానుప్రకాశ్‌ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మండల రాములు(70) 2021, జూన్‌ 12న ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ బాలిక తల్లి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ సంపత్‌ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట అడిషనల్‌ డిస్ట్రిక్ట్‌ అండ్‌ సెషన్స్‌ జడ్జి నిందితుడు నేరం చేసినట్లు నిర్ధారించి మూడేళ్లు జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. శిక్ష పడడానికి కృషి చేసిన పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ వెంకట్‌లింగం, కోర్టు కానిస్టేబుళ్లు శ్రీనివాస్‌, స్వామి, కోర్టు లైజనింగ్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ రాజమల్లును పోలీస్‌ కమిషనర్‌ అభినందించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

శివ్వంపేట(నర్సాపూర్‌): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రవికాంత్‌ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌ మండలం షాపూర్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(37) మంగళవారం విధులకు అని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో బుధవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం ఉదయం శివ్వంపేట మండలం నవాబుపేట సాంబయ్య చెరువులో మృత దేహం లభ్యం కావడంతో అది శ్రీనివాస్‌రెడ్డి మృత దేహంగా గుర్తించినట్లు పోలీసులు చెప్పారు. భార్య మనీషా ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

గృహిణి అదృశ్యం

మనోహరాబాద్‌(తూప్రాన్‌): గృహిణి కనిపించకుండాపోయినట్లు మనోహరాబాద్‌ ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డికి చెందిన పుట్ట స్వాతి కొన్ని రోజులుగా మండలంలోని కాళ్ళకల్‌లో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమె మానసికి స్థితి సరిగా లేదు. బుధవారం ఇంటి నుంచి వెళ్లి రాలేదు. దీంతో చెలెలు భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హుస్నాబాద్‌షా

పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్‌: పొన్నం రాజకీయ చరిత్రలో మంత్రి పదవి దక్కడం ఇదే మొదటిసారి. నుస్తులాపూర్‌, ఇందుర్తి, హుస్నాబాద్‌తో ఆయనకు అనుబంధం ఉంది. అయినా మంత్రి పదవి నోచుకోలేదు. గతం నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఇక్కడ మాత్రం ప్రతిపక్షమే ఉండేది. ఇందుర్తి నుంచి హుస్నాబాద్‌కు మారినా నియోజకవర్గం నుంచి మొదటి సారిగా కాంగ్రెస్‌ నుంచి ప్రవీణ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలో ఉన్నప్పటికీ మంత్రి పదవికి నోచుకోలేదు. తదనంతరం 2014, 2018 ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌(ప్రస్తుత బీఆర్‌ఎస్‌) నుంచి ఒడితెల సతీశ్‌కుమార్‌ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పుడు కూడా టీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ హుస్నాబాద్‌కు మంత్రి పదవి దక్కలేదు. 2014లో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ పార్లమెంట్‌ కార్యదర్శిగా ఉన్నారు. 2009లో సీపీఐ నుంచి చాడ వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ సమయంలో చాడ వెంకట్‌రెడ్డి శాసనసభ పక్ష నేతగా ఉన్నారు. ఇప్పటికి హుస్నాబాద్‌కు మంత్రి పదవి వరించడం విశేషం.

పొన్నంకు కలిసొచ్చిన హుస్నాబాద్‌

విద్యార్థి నాయకుడిగా ఆయన రాజకీయ ప్రస్థానం మొదలై ఉమ్మడి ఏపీ మార్క్‌ఫెడ్‌ రాష్ట్ర చైర్మన్‌గా, ఎంపీగా, నేడు మంత్రి పదవిని అధిరోహించారు. కరీంనగర్‌ ఎంపీగా పొన్నం ప్రభాకర్‌ గెలిచిన సమయంలో కేంద్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఆయనకు ఉన్నత పదవులు దక్కలేదు. ఉమ్మడి ఏపీ పార్లమెంట్‌ సభ్యుల కన్వీనర్‌గా పని చేశారు. కరీంనగర్‌ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసినా అక్కడి ప్రజలు ఆదరించలేదు. తన రాజకీయ భవిష్యత్‌ కోసం అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఈ సారి హుస్నాబాద్‌ను ఎంచుకున్నారు. బీఆర్‌ఎస్‌ కంచుకోటలో పాగా వేసి హుస్నాబాద్‌ను హస్తగతం చేసుకొని మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిపొందారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్‌ పార్టీ నుంచి ఒకే ఒక్కడుగా పొన్నం ప్రభాకర్‌ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అందులో భాగంగా సిద్దిపేట జిల్లాలోని కేసీఆర్‌, హరీశ్‌రావు ఇలాకాలో పొన్నం ప్రభాకర్‌ మంత్రిగా ఉండడం పెద్ద సవాల్‌గా చెప్పుకోవచ్చు. హుస్నాబాద్‌ నియోజకవర్గం మూడు జిల్లాలైనా సిద్దిపేట, కరీంనగర్‌, హన్మకొండ జిల్లాల పరిధిలో ఉంది. అది కూడా ఆయనకు మరో సవాల్‌గా మారనుంది. మొదటి సారి ఎమ్మెల్యేగా గెలువడం, కాంగ్రెస్‌ అధిష్టానంతో సత్సంబంధాలు కలిగి ఉండడం, బీసీ సామాజిక వర్గంలో బలమైన నాయకుడు కావడంతో క్యాబినెట్‌లో చోటు దక్కింది. బీసీ కోటా నుంచి పొన్నంకు మంత్రి పదవి దక్కడం హుస్నాబాద్‌ నియోజకవర్గం ఆయనకు కలిసి వచ్చిందనే చెప్పుకోవచ్చు. పొన్నం రాజకీయ భవిష్యత్‌కు పునాది పడడమే కాకుండా, ఉద్యమాల గడ్డ, చైతన్య ప్రాంతమైన హుస్నాబాద్‌ను మొదటి సారి మంత్రి పదవి వరించడం ఈ ప్రాంతానికి శుభ పరిణామమే.

70 ఏళ్ల తర్వాత

నాడు ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలోని నుస్తులాపూర్‌ నియోజకవర్గం, నిన్న ఇందుర్తి, నేడు హుస్నాబాద్‌ నియోజకవర్గంగా పునరుద్ధరింపబడినా 70 ఏళ్లల్లో ఏనాడూ హుస్నాబాద్‌ నియోజకవర్గం నుంచి మంత్రి పదవి లభించక అభివృద్ధికి నోచుకోలేదు. ఈ మారు ఎన్నికల్లో విజయం సాధించిన పొన్నంకు క్యాబినెట్‌ హోదా దక్కడంతో హుస్నాబాద్‌ నియోజకవర్గ దశ, దిశ మారబోతుందని ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యావంతుడు, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించడం కూడా మంత్రి పదవి దక్కడంలో ప్రధాన కారణాలుగా చెప్పుకోవాలి. హుస్నాబాద్‌ ప్రాంతానికి మంత్రి పదవి దక్కడంతో 70 ఏళ్ల కల నెరవేరింది. హుస్నాబాద్‌ దశ, దిశ మారి అభివృద్ధి వైపు అడుగులు పడుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సైనిక బాక్సింగ్‌ చాంపియన్‌ రామయ్య

సిద్దిపేటరూరల్‌: క్రీడల ద్వారా మానసిక, శారీరక దృఢత్వం పొందవచ్చని అంతర్జాతీయ సైనిక బాక్సింగ్‌ చాంపియన్‌ జె.రామయ్య అన్నారు. సిద్దిపేట శివారులోని కేంద్రీయ విద్యాలయలో గురువారం వార్షిక క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సిద్దిపేట రూరల్‌ సీఐ చేరాలుతో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడానైపుణ్యాలు పెంపొందించడంలో కేంద్రీయ విద్యాలయాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. 42 క్రీడాపోటీల్లో ఓవరాల్‌ ఛాంపియన్‌గా ఠాగూర్‌, రన్నర్స్‌గా శివాజీ, రామన్‌ హౌజ్‌ జట్లు నిలిచాయి. అనంతరం విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ రాజేశ్వరి, ఉపాధ్యాయులు డీపీ రాణా, రాజుకుమార్‌ చౌహన్‌, బైరవ, భూమయ్య, రాజు, ఆర్తి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిస్ట్‌ మల్లిక్‌ చిత్రాలు

దుబ్బాకటౌన్‌: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు కాముని మల్లికార్జున్‌ రేవంత్‌ రెడ్డి చిత్రాలను వేసి శుభాకాంక్షలు తెలిపారు.







సీఎం రేవంత్‌రెడ్డి చిత్రం ఆవిష్కరణ

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): తెలంగాణ నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రాన్ని ప్రముఖ చిత్రాకారుడు రుస్తుం గురువారం సిద్దిపేట పట్టణంలోని రుస్తుం ఆర్ట్‌ గ్యాలరీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఏఎఫ్‌ అధ్యక్షురాలు జులేఖరుస్తుం తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

- పాత కక్షలతో పథకం ప్రకారం దాడి



జహీరాబాద్‌: మండలంలోని రంజోల్‌ గ్రామంలో ఎరుకలి ఝర్నప్ప(45) హత్య కేసులో అదే గ్రామానికి చెందిన నిందితుడు ఎరుకలి శ్రీకాంత్‌ అనే యువకుడిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ బి.రాజు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రంజోల్‌ పాలిటెక్నిక్‌ కళాశాలలో ఝర్నప్ప వాచ్‌మాన్‌గా పని చేస్తున్నాడు. రెండు నెలల క్రితం అతడి మోటారు సైకిల్‌ చోరీకి గురైంది. దానిని శ్రీకాంతే దొంగిలించి ఉంటాడని అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంపై వారి రెండు కుటుంబాల మధ్య వివాదం జరిగింది. ఈ క్రమంలో ఈ నెల 3న పిల్లల విషయంలో మరోమారు ఆ రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. దీంతో వారి మధ్య వివాదం మరింత ముదిరింది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న శ్రీకాంత్‌ ఝర్నప్పను హత్య చేసేందుకు పథకం పన్నాడు. గ్రామ శివారులో ఉన్న పాలిటెక్నిక్‌ కళాశాలకు ఝర్నప్ప తన మోటారు సైకిల్‌పై ఈ నెల 5న విధులకు బయలుదేరాడు. అలా వెళుతుండగా శ్రీకాంత్‌ కూడా వెనుక నుంచి మోటారు సైకిల్‌పై ఝర్నప్పను అనుసరించాడు. తన దగ్గర ఉన్న కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. దీంతో ఝర్నప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు శ్రీకాంత్‌ అక్కడి నుంచి పారిపోయాడు. నిందితుడు శ్రీకాంత్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ బి.రాజు తెలిపారు.

ఆడిటర్‌పై కొనసాగుతున్న విచారణ



స్వామి వారి మూల విరాట్టు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సంబంధించిన ఆడిటర్‌పై గతంలో ఆలయ ఈవో బాలాజీ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు నాలుగు రోజులుగా విచారణ జరుపుతున్నారు. పోలీసులు, ఆలయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవస్థానానికి సంబంధించి 2021 నుంచి 2023 వరకు మూడేళ్ల లావాదేవీలు, ఐటీ రిటర్న్స్‌, జీఎస్టీ లెక్కలను చూడడానికి హైదరబాద్‌కు చెందిన ప్రైవేటు ఆడిటర్‌ ధనుంజయ్‌కు ఆలయ ఈవో బాధ్యతలను అప్పగించారు. అందుకోసం మూడు ఏళ్లకు రూ.17 లక్షల 30 వేలును ఆడిటర్‌కు చెల్లించారు. ఆడిటర్‌ ఆ డబ్బులు మొత్తం తీసుకొని అందులో సుమారు రూ.3 లక్షల 30 వేలు మాత్రమే సంబంధిత శాఖకు చెల్లించాడు. ఈ విషయంలో ఐటీశాఖ నుంచి ఆలయానికి మూడు నెలల క్రితం నోటీసులు వచ్చాయి. దీంతో ఆలయ అధికారులు సంబంధిత ఆడిటర్‌ను నిలదీయగా అతడు ఐటీశాఖకు డబ్బులు చెల్లించలేదన్న విషయం వెల్లడైంది. దీనితో ఆలయ ఈవో బాలాజీ గత నెల 11న కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసుల విచారణ ఆలస్యం అయింది. దీంతో నాలుగు రోజులుగా విచారణ జరుపుతున్న చేర్యాల సీఐ సత్యానారాయణరెడ్డి గురువారం మాట్లాడుతూ ఆడిటర్‌ను ఇంకా అదుపులోకి తీసుకోలేదని, పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

చిరుత కలకలం

గొట్టిముక్కులలో దూడపై దాడి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ వికాస్‌

పెద్దశంకరంపేట(మెదక్‌): పెద్దశంకరంపేట మండలం గొట్టిముక్కుల శివారులో మరోసారి చిరుతపులి సంచారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన తోట యాదయ్య తన పొలం వద్ద పశువులను కట్టాడు. బుధవారం రాత్రి చిరుతపులి దూడపై దాడి చేసి చంపేసింది. ఘటనా స్థలాన్ని పెద్దశంకరంపేట ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌ వికాస్‌, అటవీశాఖ అధికారులు సందర్శించి చిరుత కదలికలు, పాద ముద్రలను సేకరించారు. గ్రామస్తులు రాత్రి వేళ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దూడ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక అందించి రైతుకు నష్టపరిహారం అందించేలా చూస్తామని ఎఫ్‌ఆర్‌ఓ తెలిపారు. గత సెప్టెంబర్‌ నెలలో ఇదే గ్రామంలో కనిపించడంతో పాటు టెంకటి శివారులో చిరుతపులి లేగదూడను చంపింది. అప్పటి నుంచి మండలంలో దాని సంచారం లేదు. ప్రస్తుతం మళ్లీ చిరుత సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఫారెస్ట్‌ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు. సెక్షన్‌ అధికారి నర్సింలు, బీట్‌ ఆఫీసర్‌ ప్రవీణ్‌ గ్రామస్తులు తదితరులున్నారు.

ప్రకృతిని కాపాడుకోవాలి



విశ్వంజి మహారాజ్‌ ఆశీర్వాదం తీసుకుంటున్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

విశ్వయోగి విశ్వంజి మహారాజ్‌

శివ్వంపేట(నర్సాపూర్‌): ప్రకృతి, భూమాతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుంటూరు విశ్వయోగి విశ్వంజి మహారాజ్‌ ఉద్బోధించారు. మండల పరిధి గూడూర్‌ గ్రామంలో హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగొని శివకుమార్‌గౌడ్‌ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీగురు పీఠం శిలాన్యాస మహోత్సవం గురువారం కనుల పండువగా నిర్వహించారు. శిలాన్యాసం కార్యక్రమంలో విశ్వయోగి విశ్వంజి మహారాజ్‌ పాల్గొన్నారు. హోమం, ప్రత్యేక పూజలు అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మనుషులు ధన సంపాదనలో మునిగిపోయి నైతిక విలువలకు ప్రాధాన్యత మరిచిపోతున్నారన్నారు. సేవాగుణంలో ప్రపంచ వ్యాప్తంగా ముందు వరుసలో రతన్‌టాటా, బిల్‌గేట్స్‌ ఉన్నారని వారిని ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఐకమత్యంగా ఉంటూ సనాతన ధర్మం పాటిస్తూ సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఆలయ నిర్మాణా లకు కృషి చేస్తున్న శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, శివకుమార్‌గౌడ్‌ని ఆయన అభినందించారు. పాల్గొని పూజలు నిర్వహించిన నర్సాపూర్‌, దుబ్బాక ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభా కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని ఆశీర్వదించారు. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్యామాధవరెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రమణగౌడ్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు కృష్ణారావు, యాద గౌడ్‌, శ్రీనివాసగౌడ్‌, వేణుగోపాలరెడ్డి, లాయక్‌, రాజశేఖర్‌గౌడ్‌, పూల అర్జున్‌, నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు పబ్బ స్వరూప రమేశ్‌గుప్తా, సూర్యంగౌడ్‌, మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ముగ్గురు మృతి



రాకేశ్‌(ఫైల్‌)

అక్కన్నపేట(హుస్నాబాద్‌): తండ్రి మందలించడంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన కొడుకు గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామ పరిధిలోని తెనుగుపల్లికి చెందిన బైరి రాకేశ్‌(25) వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతడిని సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. తండ్రి బైరి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తాండ్ర వివేక్‌ తెలిపారు.

మనస్తాపంతో ..



బాబు(ఫైల్‌)

వర్గల్‌(గజ్వేల్‌): భార్య తన వెంట రాలేదని మనస్తాపంతో పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటన వర్గల్‌ మండలం శాకారంలో జరిగింది. గౌరారం ఎస్‌ఐ విజయ భాస్కర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శాకారం గ్రామానికి చెందిన పంగ బాబు(26) ఈ నెల ఒకటిన భార్య వినోదతో కలిసి అనంతసాగర్‌లోని ఆమె సోదరి ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లారు. 2న రాత్రి దావత్‌లో బాబు మద్యం తాగాడు. మద్యం మత్తులో ఉన్నాడనే కారణంతో భార్య బాబుతో వెళ్లడానికి నిరాకరించింది. దీంతో గొడవపడి తాను మాత్రం శాకారం చేరాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగి గ్రామానికి చెందిన వ్యక్తికి ఆ విషయం చెప్పాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ములుగు ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

నర్సాపూర్‌రూరల్‌: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నర్సాపూర్‌లో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం స్థానికి కరెంట్‌ ఆఫీస్‌ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి స్పృహ కోల్పోయి పడి ఉండడంతో స్థానిక లైన్‌మెన్‌ నాగరాజు అతడిని అంబులెన్స్‌లో నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహంపై చాక్లెట్‌ కలర్‌ షర్ట్‌, బ్లాక్‌ కలర్‌ ప్యాంట్‌ ఉన్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌ ..



లక్ష్మణ్‌ (ఫైల్‌)

వట్‌పల్లి(అందోల్‌): రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌ మృతి చెందిన ఘటన గురువారం వట్‌పల్లి మండల పరిధిలోని ఖాదిరాబాద్‌ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో స్పెషల్‌ పార్టీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పుట్ల లక్ష్మణ్‌(38) బుధవారం డ్యూటీ ముగించుకొని తన తల్లిని చూసేందుకు స్వగ్రామమైన వట్‌పల్లి మండల పరిధిలోని ఖాదిరాబాద్‌ గ్రామానికి బైక్‌పై వస్తుండగా గ్రామ శివారులోకి రాగానే మూల మలుపు వద్ద బైకు అదుపుతప్పి పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అతడి భార్య రమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని..

మునిపల్లి(అందోల్‌): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తాటిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రహ్లాద్‌రెడ్డి(48) అదే గ్రామానికి చెందిన నీలేందర్‌తో కలిసి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ప్రహ్లాద్‌రెడ్డికి గాయాలు కావడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంటైనర్‌ ఢీ: బాలుడి మృతి

- గృహప్రవేశం రోజే విషాదం
- రహదారిపై బంధువుల రాస్తారోకో
- తూప్రాన్‌ డీఎస్పీహామీతో విరమణ



మృత దేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చేగుంట(తూప్రాన్‌): గృహప్రవేశం రోజునే తమ 11 ఏళ్ల కొడుకు లారీ ఢీకొని మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. మండల పరిధిలోని మక్కారాజ్‌ పేట గ్రామానికి చెందిన ఎర్రగొల్ల రమేశ్‌, రజిత ఇటీవలే నూతనంగా ఇంటిని నిర్మించారు. గురువారం తెల్లవారు జామున గృహప్రవేశ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య ఘనంగా నిర్వహించారు. గృహప్రవేశం కోసం అవసరమైన వస్తువులను తీసుకురావడానికి వారి పెద్ద కొడుకు ఆరో తరగతి చదువుతున్న ఎర్రగొల్ల నగేశ్‌(11) సైకిల్‌పై వస్తుండగా గజ్వేల్‌ వైపు నుంచి చేగుంటకు వస్తున్న ఓ కంటైనర్‌ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నగేశ్‌ తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బంధువులు వెంటనే అక్కడికి చేరుకొని లారీ డ్రైవర్‌పై దాడికి దిగారు. అనంతరం గజ్వేల్‌ రహదారిపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. రెండు గంటలపాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి తూప్రాన్‌ డీఎస్పీ యాదగిరిరెడ్డి, రామాయంపేట సీఐ లక్ష్మిబాబు చేరుకొని బంధువులను సముదాయించి నచ్చజెప్పారు. న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్‌ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మక్కరాజిపేట సర్పంచ్‌ కుమ్మరి శ్రీనివాస్‌, ఎంపీటీసీ బండి కవిత విశ్వేశ్వరరావుతో పాటు గ్రామ నాయకులు, బాలుడి బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాస్తారోకోలో పాల్గొని న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.

స్కూటీపై నుంచి పడి కార్మికుడు..



నాగేశ్‌ మృత దేహం

పటాన్‌చెరు టౌన్‌: స్కూటీపై వస్తూ గుంతలు తప్పించబోయి కిందపడి ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. హెడ్‌ కానిస్టేబుల్‌ పాషా కథనం ప్రకారం.. అల్లాదుర్గానికి చెందిన కుమ్మరి నాగేశ్‌(32) బతుకుదెరువు కోసం 9 ఏళ్ల క్రితం కంది మండలం ఇంద్రకరణ్‌కి వచ్చి పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలో ఓ ప్రైవేట్‌ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఆయన తన విధుల నుంచి స్కూటీపై తిరిగి వస్తుండగా పారిశ్రామిక వాడలో గుంతలను తప్పించిపోయి అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.